

ఫలరాజు కొండెక్కె..

పెరిగిన మామిడి కాయల ధరలు

● దిగుబడులు తగ్గటంతో భారం





మామిడికాయల విక్రయాలు

బూర్గంపాడు: మధుర ఫలం మామిడి ఈ ఏడాది మరింతగా పెరిగాయి. వేసవిలో అందరు ఇష్టంగా తినే మామిడి ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉండే పరిస్థితులు లేవు. ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితులతో మామిడి దిగుబడి గణనీయంగా తగ్గింది. ఇటీవల కురుస్తున్న గాలివానలకు మామిడి చెట్లకు ఉన్న కొద్దిపాటి కాయలు కూడా రాలిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో మామిడి కాయల ధరలు అమాంతం పెరిగాయి. కొంత ఆలస్యంగా మార్కెట్‌లోకి వస్తున్న మామిడి కాయల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి.

జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట, ముల్కలపల్లి, బూర్గంపాడు, పాల్వంచ మండలాల్లో మామిడి తోటలు ఎక్కువగా ఉన్నాయి. కొన్నేళ్లుగా ప్రతికూల వాతావరణ పరిస్థితులు మామిడి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. దీనికి తోడు పూత దశలో నల్లి ఆశించటం కూడా దిగుబడులు తగ్గటానికి కారణమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మామిడి సాగు చేస్తున్న రైతులకు పెట్టుబడులు కూడా తిరిగిరావటం లేదు. దీంతో చాలామంది రైతులు మామిడి తోటలను తొలగించి పామాయిల్, జామాయిల్ సాగుకు మొగ్గుచూపుతున్నారు. జిల్లాలో మామిడి సాగు తగ్గుతుండటంతో మామిడి కాయల ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి. అయితే దిగుబడులు తగ్గుతుండటంతో రైతులకు నష్టం వాటిల్లుతుంది. జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు కేవలం పామాయిల్ సాగును ప్రోత్సహిస్తుండటంతో మామిడి సాగు గణనీయంగా తగ్గుతుంది.

పచ్చడి మామిడి కూడా...

వేసవిలో ప్రతీ ఇంట్లో మామిడి కాయ పచ్చళ్లు పెట్టడం పరిపాటి. ఈ ఏడాది పచ్చడి మామిడి కాయలకు కూడా మార్కెట్‌లో ఫుల్ డిమాండ్ ఉంది. పచ్చడి మామిడి కాయలు ఎక్కువగా ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతుండటంతో రేటు కూడా విపరీతంగా పెరుగుతుంది. పచ్చడి మామిడి కాయలు ఒక్కటి రూ 20 నుంచి రూ 30 వరకు పలుకుతుంది. రానున్న రోజులలో ధరలు మరింతగా పెరుగుతాయని వ్యాపారులు అంటున్నారు. దిగుబడులు లేకపోవటంతోనే ధరల పెరుగుదలకు కారణమని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

వ్యాపారులకే లాభం..

ఈ ఏడాది మే నెల మొదటివారం నుంచే మామిడి కాయలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో మామిడి కాయల ధరలు కిలో రూ.100 నుంచి రూ.150 వరకు పలుకుతుంది. బంగినపల్లి, పెద్ద రసాలు, చిన్న రసాల ధరలు కిలో రూ.150 వరకు పలుకుతుంది. ఇతర జిల్లాల నుంచి కూడా మార్కెట్‌లోకి మామిడి కాయలు అమ్మకాలకు వస్తున్నాయి. జిల్లాకు సరిహద్దులో ఉన్న ఏపీలోని పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి వ్యాపారులు మామిడి కాయలను మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. మామిడి పండించిన రైతులకు గిట్టుబాటు ధర లభించకున్న వ్యాపారులు మాత్రం ధరలను ఏమాత్రం తగ్గించకుండా మార్కెట్ చేసుకుంటున్నారు. మామిడి ధరలు ఎక్కువగా ఉండటంతో సామాన్యులు మామిడి కాయలు కొనలేని పరిస్థితులున్నాయి.



క్లుప్తంగా

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన ఇద్దరు మహిళలకు వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న విజయ, మమతలకు ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు సమకూర్చిన సాయాన్ని భద్రాద్రి ఆలయ ఈఓ ఎల్.రమాదేవి అందజేశారు. ఫౌండేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాస రాజు, తదితరులు పాల్గొన్నారు.

ముళ్లకంపలు తొలగింపు



కంప, పిచ్చిమొక్కలను తొలగిస్తున్న జేసీబీ

దమ్మపేట: మండలంలోని మందలపల్లి నుండి అచ్యుతాపురం క్రాస్ రోడ్డు వరకు ఉన్న రహదారికి ఇరుపక్కల ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలను స్థానిక యువకులుసొంత ఖర్చులతో శుక్రవారం తొలగించారు. పిచ్చిమొక్కలు వేపుగా పెరిగి రోడ్డు పైకి రావడంతో జేసీబీ ఏర్పాటుచేసుకుని తొలగించారు. ఈ సందర్భంగా యువకులను పలువురు అభినందించారు. సోము, పాలడుగుల అబ్బులు, అజీమ్, మోరంపూడి భాను, నాగరాజు, చంటి, జాన్ పాషా పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు ఇవ్వాలి

దుమ్ముగూడెం: మండలంలోని దంతెనం పంచాయతీలో రీ సర్వే చేసి అర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని పంచాయతీ ప్రజలు పంచాయతీ కార్యదర్శి మాధవికి శుక్రవారం వినతిపత్రం అందచేశారు. పంచాయతీలో చాలా మంది ఇల్లు లేని నిరుపేద అర్హులున్నారని వారిని మరోసారి రీ సర్వే చేసి ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా చూడాలని అనర్హులకు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బోల్లోజు వేణు, సుబ్బారావు, మోతుకూరి శ్రీకాంత్, సాగర్, వెంకటాద్రి ఉన్నారు.

ప్రతీ ఇంట్లో ఇంకుడుగుంత నిర్మించుకోవాలి



ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న ప్రభాకర్

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): ప్రతీ ఇంట్లో విధిగా ఇంకుడుగుంతల నిర్మాణాలు చేసుకోవాలని డీఎల్‌పీఓ ప్రభాకర్ సూచించారు. మండలంలోని మర్రిగూడెం పంచాయతీలో శుక్రవారం ఆయన పర్యటించి ఇంకుడుగుంతల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఉపాధి పనులు జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. పంచాయతీ కార్యాలయంలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఏఓ రమణ, ఎంపీఓ ఉన్నారు.

మణుగూరు అభివృద్ధికి ప్రత్యేక నిధులు

● ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



మోడల్ హౌస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు టౌన్: మున్సిపాలిటీ, మండల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని రూ.27 లక్షల వ్యయంతో గాంధీబొమ్మ సెంటర్, ఆదర్శనగర్‌లలో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా నెరెళ్ల చెరువు నుంచి గాంధీనగర్ వరకు వాగు పూడిక తీశామని, నెరెళ్ల చెరువు పూడిక తీపించి చెరువు సామర్థ్యం పెంచుతామన్నారు. భగత్‌సింగ్‌నగర్, శివలింగాపురంలలో రూ.6 కోట్లతో వాటర్ ట్యాంక్ నిర్మాణాలు చేపడుతున్నామని నిర్మాణాలు పూర్తయితే మున్సిపాలిటీలో నీటి సమస్య తీరుతుందన్నారు. అనంతరం పద్మశాలిభవన్ వద్ద నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ని ప్రారంభించారు. మున్సిపల్ టి.ప్రసాద్, ఏఈ సత్య, విద్యుత్ శాఖ అధికారులు ఉన్నారు.

ఇందిరమ్మ మోడల్ హౌస్ ప్రారంభం

మండల పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయ పరిసరాల్లో నిర్మించిన నమూనా గృహాన్ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా నమూనాను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యకర్తలకు, నాయకులకు స్వీట్ తినిపించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇందిరమ్మ ఇల్లు వచ్చిన లబ్ధిదారులకు బేస్‌మెంట్ పూర్తయిన లబ్ధిదారులకు రూ.లక్ష ఖాతాల్లో జమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్మానుయేల్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్, పట్టణ అధ్యక్షుడు శివ, బాబు, నాయకులు సౌజన్య, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి



దమ్మపేట: పోస్టర్ల ప్రదర్శన..



అశ్వారావుపేటరూరల్: అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ స్రవంతి

దమ్మపేట: రైతులు రసాయనిక ఎరువుల వినియోగంను తగ్గించుకోవాలని అశ్వారావుపేట ఏడీఏ రవికుమార్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బాలరాజుగూడెం గ్రామంలో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ఏడీఏ రవికుమార్ మాట్లాడుతూ... వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునే దిశగా సాగులో అనుసరించాల్సిన నూతన పద్ధతులు, మెళకువలను వివరించారు. జాతీయ స్థాయిలో భూగర్భ జలాలు తక్కువగా ఉన్న మండలంలో దమ్మపేట కూడా నమోదయి ఉందన్నారు. సాగులో మెళకువలను తెలుసుకోవడానికి వ్యవసాయ విశ్వవిద్యాలయం వారిచే ప్రచురింపబడుతున్న 'వ్యవసాయం దిక్సూచి' అను పుస్తకమును చదువుకోవాలని సూచించారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు పావని, కృష్ణ తేజ, దమ్మపేట ఏఓ చంద్రశేఖర రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఏఈఓలు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: అన్నదాతలు పంటల సాగు ఖర్చులను సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలని స్థానిక వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ డి.స్రవంతి, డాక్టర్ పీ.శ్రీలత సూచించారు. మండల పరిధిలోని ఆసుపాక గ్రామంలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో శివరాం ప్రసాద్, పశుసంవర్ధక అధికారిణి డాక్టర్ స్వప్న, ఏఈవోలు నార్లపాటి రవీంద్ర, ఆరేపల్లి సతీష్, కార్యదర్శి మోతీలాల్, రైతులు ఉన్నారు.

రోడ్డుపై డ్రమ్ముల ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్..

మణుగూరు టౌన్: మున్సిపాలిటీలోని రాజుపేటలో రోడ్డుపై వాహనాల వేగ నియంత్రణకు అధికారులు శుక్రవారం డ్రమ్ములు ఏర్పాటుచేశారు. ఈ మేరకు శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'ఈ ఊరికి నిద్ర కరువు' కథనానికి స్పందించిన అధికారులు డ్రమ్ములు ఏర్పాటు చేశారు. సింగరేణి ఆధ్వర్యంలో మరో డ్రమ్ములు ఏర్పాటుచేయగా టీఎస్ఎండీసీ అధికారుల సూచన మేరకుగ్రామంలో దుమ్ము నియంత్రణకు వాటర్‌ట్యాంకర్‌ను కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

మణుగూరు టౌన్: ఏజెన్సీ ప్రాంతంలో కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా విద్యనందిస్తున్న మణుగూరు సింగరేణి హైస్కూల్‌లో ఖాళీగా ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ అన్నారు. శుక్రవారం టీబీజీకేఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విద్యా సంవత్సరం ప్రారంభానికి మరికొద్ది రోజులు మాత్రమే ఉన్నందున పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆపరేటర్లు

మణుగూరు రూరల్: ఈపీ ఆపరేటర్ల పదోన్నతుల పత్రాలు అందజేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈపీ ఆపరేటర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఎస్ఓటు జీఎం డి.శ్యాంసుందర్‌కు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఈపీ ఆపరేటర్లు మాట్లాడుతూ... కొత్తగూడెం రీజియన్ స్థాయిలోని ఏరియాల్లో పని చేస్తున్న ఈపీ ఆపరేటర్లకు స్పెషల్, ఏ,బీ గ్రేడ్ల పదోన్నతుల ఖాళీల భర్తీకి అర్హత పరీక్ష నిర్వహించి ఫలితాలను వెల్లడించడం హర్షణీయమన్నారు. వెంటనే పదోన్నతుల లేఖలను అందజేయడంతో పాటు డీ,సీ గ్రేడ్ పదోన్నతుల భర్తీకి తగు చర్యలు చేపట్టాలన్నారు. ఆపరేటర్లు దరిశ రమేష్, సిహెచ్.అనిల్, ఎస్.సంతోష్, శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం



లేచిపోయిన ఇంటి రేకులు



మొండికుంట-భద్రాచలం రోడ్డుపై పడిన చెట్టు

అశ్వాపురం: మండలంలో శుక్రవారం తెల్లవారుఝామున ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు పలు గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. ఈదురుగాలులకు రామచంద్రాపురంలో వెంకన్న, వెంకటరెడ్డి, తుమ్మలచెరువులో మడకం నరసింహారావు, కుర్నాపల్లి కొత్తూరులో బోడయ్య ఇళ్లపై కప్పులు లేచిపోయాయి. రామచంద్రాపురంలో మొండికుంట–భద్రాచలం రహదారిపై చెట్టుపై రాకపోకలకు అంతరాయం కలిగింది. మొండికుంట అటవీ ప్రాంతంలో మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై చెట్టుపై పడి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

దోమ పుట్టకుండా.. కుట్టకుండా చూడాలి

● జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన
● విస్తృతంగా ర్యాలీలు, మానవహారాలు

ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని డెంగీ నివారణకు సహకరించాలని.. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రైడే పాటించాలని.. దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని.. పరిశుభ్రతతో డెంగీని పారద్రోలొచ్చని పలువురు వైద్యాధికారులు సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు, మానవహారాలు విస్తృతంగా నిర్వహించారు. డెంగీ లక్షణాలు, నివారణ, చికిత్సపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు విషజ్వరాలు వ్యాపించకుండా ఉండేందుకు జాగ్రత్తలు సూచించారు. రానున్న వర్షాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.



అశ్వారావుపేటరూరల్: మానవహారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం(అశ్వారావుపేట), గుమ్మడవల్లి పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వేర్వేరుగా అవగాహన ర్యాలీలను నిర్వహించారు. అశ్వారావుపేటలోని రింగ్‌రోడ్ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వరకు వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ తీసి, మానవహారం నిర్వహించారు. హెచ్‌సీల వైద్యాధికారులు రాందాస్ నాయక్, మధులిక, సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు, డీపీఎంవో మోహన్, హెచ్‌వీలు దుర్గమ్మ, బేబి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రుగొండ: జాతీయ డెంగీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కనకం తనుజ, వెంకటప్రకాష్, హెడ్‌నర్స్ శోభ, వైద్యసిబ్బంది దీపిక, రమ్య, సబిహా, సూపర్‌వైజర్లు బుజ్జమ్మ, పూర్ణరావు, సుమతి, శ్రీను పాల్గొన్నారు.

ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ..

అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఎర్రగుంట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో డెంగ్యూ నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ప్రధాన సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, డాక్టర్ తన్మయ్, సిబ్బంది జయలక్ష్మి, ప్రకాశ్‌రావు, ప్రసాద్, రామదాసు, కోటేశ్వరరావు, ప్రేమలత, జ్యోతి, రవికుమార్ పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : ప్రజలు దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పర్ణశాల డాక్టర్ రేణుకారెడ్డి సూచించారు. డెంగీ నివారణ దినోత్సవ సందర్భంగా పర్ణశాల పీహెచ్‌సీలో ర్యాలీ నిర్వహించి డెంగీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హోమియో డాక్టర్ రాజేష్, వైద్యసిబ్బంది వెంకట నరసమ్మ, అమ్మాజీ, నాగేశ్వరరావు, ఆశ వర్కర్లు తదితరులు ఉన్నారు.

కరకగూడెం: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని కరకగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి రవితేజ పిలుపునిచ్చారు. డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా సిబ్బందితో కలిసి స్థానిక పీహెచ్‌సీ నుండి మండల కేంద్రం వరకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుండాల: డెంగీ నివారణపై ప్రతీ ఒక్కరు అవగాహన ఉండాలని గుండాల, ఆళ్లపల్లి ప్రభుత్వ వైద్యాధికారులు మనేష్ రెడ్డి, సంఘమిత్ర అన్నారు. డెంగీ నివారణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆయా మండల కేంద్రాల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

ములకలపల్లి: జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని మంగపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రదర్శన చేశారు, పీహెచ్‌సీ నుండి బస్టాండ్ సెంటర్ వరకూ, ర్యాలీ చేసి, మానవహారం నిర్మించారు. వైద్యాధికారి సాయి కళ్యాణ్, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



దుమ్ముగూడెంలో..

మణుగూరు రూరల్ : మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పట్టణ ప్రధాన రహదారిపై వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నిశాంత్ రావు, పీహెచ్‌సీ డాక్టర్ సునీల్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



గుండాల: ఆళ్లపల్లిలో వైద్య సిబ్బంది ర్యాలీ..



ములకలపల్లిలో..



కరకగూడెంలో..



చంద్రుగొండలో..



అన్నపురెడ్డిపల్లి : ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..



మణుగూరు రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఆసరా పెంచుతారని..

● పింఛన్ నగదు పెంపుపై లబ్ధిదారుల ఎదురుచూపులు..
● స్పష్టత లేక ఆవేదన





మణుగూరు రూరల్: ఆసరా పింఛన్లు పెరిగి తమ చేతులకు ఎప్పుడు వస్తాయోనని లబ్ధిదారులు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ పింఛన్లను రూ.2016, రూ.4016లుగా చేసి నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు చేపట్టారు. దాదాపు పదేళ్లపాటు లబ్ధిదారులు తమ పింఛన్‌ను ఎటువంటి ఇబ్బందులు లేకుండా పొందారు. వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం అందించే ఈ పింఛన్‌ను ఎంతో ఆసరాగా నిలిచేవి. వచ్చే పింఛన్‌లో ఆస్పత్రులకు, మందులకు పోగా లబ్ధిదారులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో పింఛన్లు పెంచి విజయవంతంగా అమలు చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగడంతో ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు పార్టీ అధికారంలోకి వస్తే ఆరుగ్యారెంటీ పథకాల్లో భాగంగా రూ.2 వేల పింఛన్‌ను రూ.4 వేలుగా, రూ.4 వేలు ఉన్న పింఛన్‌ను రూ.6 వేలుగా పెంచి ఇస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి 16 నెలలు పూర్తి కావస్తున్నా.. నేటికి ఏ ఒక్కరికి పింఛన్‌ను పెంచి అమలు చేయకపోవడంతో లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదరు. అసలు కాంగ్రెస్ ప్రభుత్వం ఆసరా పింఛన్ రూ.4 వేలను, రూ.6 వేలను అమలు చేస్తుందా లేదా..? అని లబ్ధిదారులంతా సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ పింఛన్ పెరిగితే తమ బతుకుల మరింత బాగుంటాయని లబ్ధిదారులు ఆశపడుతున్నారు. ఇప్పటికే ఆరుగ్యారంటీల్లో పలు పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పింఛన్ రూ.4వేలు, రూ.6 వేలు అమలుపై ఎలాంటి ప్రకటనలు చేయకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పింఛన్లను పెంచాలని కోరుతున్నారు.

అప్పటి పింఛనే వస్తుంది



బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలు చేసిన రూ.2,013ల ఫించనే వస్తోంది. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న రూ.4 వేల పెన్షన్ నేటి వరకు ఇవ్వలేదు. రూ.4 వేల పెన్షన్ వస్తదని ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాం.

– దేవలక్ష్మి, లబ్ధిదారురాలు

ఎదురుచూస్తున్నా..



బీఆర్ఎస్ అమలు చేసిన రూ.4,016ల పెన్షనే ఆధారమవుతోంది. కాంగ్రెస్ పాలనలో 16 నెలలు గడిచిపోయింది. ఇంకా పెన్షన్ పెంచి ఇస్తలేరు. రూ.6 వేల పెన్షన్ కోసం ఎదురు చూస్తున్నాం. త్వరగా పెన్షన్ పెంచి ఇస్తే ఆసరాగా ఉంటుంది.

– హరికృష్ణ, దివ్యాంగుడు